క్లుప్తంగా

సెంట్రల్ యూనివర్సిటీకి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న అధ్యాపకులు

డోన్ టౌన్: పుదుచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీలో ఎం.కాం కోర్సుకు డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి అనుపూరు భరత్ కుమార్ ఎంపిక య్యారు. జాతీయ స్థాయిలో ఎస్సీ క్యాటగిరిలో 35వ ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ భారతి తెలిపారు. శనివారం విద్యార్థికి నగదు పురస్కారంతో పాటు జ్ఞాపిక అందజేసి అభినందించారు. అంతే కాకుండా ఏపీ పీజీ సెట్‌లో భరత్ కుమార్ 52వ ర్యాంకు సాధించాడని కొనియాడారు. భవిష్యత్‌లో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్స్‌పాల్ వీరాచారి, అధ్యాపకులు వెంకటకృష్ణయ్య, మోహన్‌నాయక్, రామకృష్ణుడు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీల వితరణ



కుర్చీలను అందజేస్తున్న దాత

బేతంచెర్ల: మండల పరిధిలోని గోర్లగుట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల సౌకర్యార్థం కర్నూలుకు చెందిన వ్యాపారి సురేష్ గుప్తా రూ.7,500 విలువ చేసే కుర్చీలను శనివారం వితరణ చేశారు. ఈ సందర్భంగా దాతకు పాఠశాల హెచ్‌ఎం మద్దిలేటి రెడ్డి, ఉపాధ్యాయులు శివ కుమారస్వామి, క్రిష్ణయ్య ధన్యవాదాలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తల మృతికి నివాళి



కేశాలు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ, నాయకులు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రోళ్ల నాగేశ్వర్ రెడ్డి (57), బేతంచెర్ల దుర్గాపేట కాలనీకి చెందిన కేశాలు (65) అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మురళీకృష్ణ, పట్టణ, మండల కన్వీనర్లు తిరుమలేశ్వర్ రెడ్డి, పిట్టల జాకీర్, నాయకులు ఆయా ప్రాంతాలకు వెళ్లి మృతదేహాలకు నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

లారీ ఢీకొని స్కూటరిస్టు మృతి

- మరొకరికి గాయాలు



లారీ టైర్ల కింద పడిన కుమార్ నాయక్

ప్యాపిలి: మండల పరిధిలోని జలదుర్గం గ్రామ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. తుగ్గలి మండలం ఎల్లమ్మగుట్ట తండాకు చెందిన కుమార్ నాయక్ (24) తన సోదరి కుమార్తెతో కలిసి ద్విచక్రవాహనంపై నెరవాడకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో జలదుర్గం వద్ద ఎదురుగా వస్తున్న లారీ అతివేగంతో ఢీకొట్టింది. ప్రమాదంలో కుమార్ నాయక్ లారీ టైర్ల కింద నలిగి అక్కడికక్కడే మృతి చెందాడు. సోదరి కుమార్తెకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. జలదుర్గం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డాక్యుమెంట్ రైటర్ల పెన్ డౌన్



నిరసన వ్యక్తం చేస్తున్న డాక్యుమెంట్ రైటర్లు

డోన్ టౌన్: పట్టణ నడిబొడ్డున ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శివారు ప్రాంతంలోకి మార్చడంలో కూటమి ప్రభుత్వ ఉద్దేశం ఏంటని పలు రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు ప్రశ్నించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మార్చొద్దంటూ శనివారం డాక్యుమెంట్ రైటర్లు పెన్ డౌన్ కార్యక్రమాన్ని చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ, సీపీఐ, సీపీఎం, ఐద్వా, సీఐటీయూ, మహిళా సంఘాల నాయకులు వారికి మద్దతుగా రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. రాస్తారోకో నిర్వహించారు. టీడీపీ నాయకుడి లబ్ధి కోసం ప్రజలను, డాక్యుమెంట్ రైటర్లను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని పేర్కొన్నారు. నిర్ణయాన్ని మార్చుకోవాలని డిమాండ్‌చేశారు. డాక్యుమెంట్ రైటర్ల నిరసనతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి.

మొక్కజొన్న సాగుపై మక్కువ

- ఈ ఏడాది కలిసొస్తుందని అన్నదాతల ఆశాభావం
- ముందస్తు వర్షాలతో అనుకూలం
- బావులు, బోర్లు, వాగుల కింద విస్తారంగా సాగు
- నియోజకవర్గంలో ఇప్పటి వరకు 9084 ఎకరాల్లో పంట



సంజామలలో ఆశాజనకంగా కనపడుతున్న మొక్కజొన్న పంట

నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న సాగు వివరాలు (ఎకరాల్లో)

మండలం	గత ఏడాది	ఈ ఏడాది(ఇప్పటి వరకు)	సాధారణ విస్తీర్ణం
బనగానపల్లె	1976	4950	5000
కోవెలకుంట్ల	1450	630	605
సంజామల	2531	1869	790
అవుకు	6375	1305	2100
కొలిమిగుండ్ల	600	330	650

సంజామల: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతుల చూపు మొక్కజొన్న వైపు మళ్లింది. మొక్కజొన్న సాగు రైతుల్లో ఆశలను రేకెత్తిస్తోంది. గత ఏడాది ఈ పంట వేసిన రైతులు మాత్రమే నష్టాల భారిన పడలేదు. కొంత మేర లాభాలు చవిచూశారు. మిగిలిన పంటతో పోల్చుకుంటే మొక్కజొన్న పంట మేలని రైతులు భావిస్తున్నారు. గత ఏడాది మొక్కజొన్న క్వింటా రూ.2వేలు నుంచి రూ.2300 వరుకు పలికింది. ఈ పంట కాలం దాదాపు 110–130 రోజులు. ఎకరాకు 30 క్వింటాలు వచ్చినా 120 రోజులకే ఎకరాకు రూ.60 వేలు వస్తుందని రైతులు అంచనా వేసి మొక్కజొన్న పంట వైపు ఆసక్తి చూపుతున్నారు. ఈ దఫా ముందస్తు వర్షాలతో బనగానపల్లె నియోజకవర్గంలో బావులు, బోర్లు, వాగులు, కందు తదితర నీటి సౌకర్యం కలిగిన ప్రదేశాల్లో విస్తారంగా మొక్కజొన్న సాగు చేశారు.

ఆశలన్నీ మొక్కజొన్నపైనే..

మొక్కజొన్న పంటలో పెద్దగా నష్టం రాదని భావించి రైతులు ఈ పంట సాగుకు మక్కువ చూపుతున్నారు. గత ఏడాది నియోజకవర్గంలోని కోవెలకుంట్ల మండలంలో 1450 ఎకరాలు, బనగానపల్లెలో 1976 ఎకరాలు, కొలిమిగుండ్లలో 600 ఎకరాలు, అవుకులో 6375 ఎకరాలు, సంజామల మండలంలో 2531 ఎకరాలు మొక్కజొన్న సాగైంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు కూడా కాలేదు ఇప్పటికే నియోజకవర్గం వ్యాప్తంగా 9084 ఎకరాలు సాగు చేశారు. ఈ ఏడాది అంచనాలకు మించి మొక్కజొన్న పంటను రైతులు సాగు చేస్తున్నారని వ్యవసాయ అధికారులు అంచనాలు వేస్తున్నారు.

ఏడాదికి రెండు పంటలకు అవకాశం

గత ఏడాది మిర్చి, మినుము, శనగ, కంది, వరి తదితర పంటలు సాగు చేసిన రైతులు నష్టపోయారు. మొక్కజొన్న మాత్రం క్వింటా రూ.2 వేలు ఉండడం, ఆశించిన దిగుబడి రావడంతో రైతులు గట్టెక్కేశారు. మొక్కజొన్న పంటకు ఎకరాకు దాదాపు రూ.30 వేలు పెట్టుబడి అవుతుంది. అంతేకాకుండా ఏడాదికి రెండుసార్లు పంట వేయడం ద్వారా లభాయదాయకంగా ఉంటుందని భావిస్తున్నారు.

7 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా



ఈ ఏడాది 7 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశా. పంట చేతికి వచ్చే సరికి పంటకు గిట్టుబాటు ధర ఉంటుందో ఉండదో. గత ఏడాది మిర్చి పంటలో భారీ నష్టం వచ్చింది. ఈ ఏడాది మొక్కజొన్న పంటను నమ్ముకున్నాను. ప్రభుత్వం పంటకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి.

– వెంకటేశ్వర్ రెడ్డి, మొక్కజొన్న రైతు, ఆకుమల్ల

తెగుళ్ల నివారణతో అధిక దిగుబడులు



ఖరీఫ్ మొక్కజొన్న పైరును పురుగు ఆశించడం సహజం. సకాలంలో జాగ్రత్తలు తీసుకుంటే పురుగు ఉధృతిని తగ్గించుకోవచ్చు. రసం పీల్చు పరుగులు ఎక్కువగా ఉంటే మోనోక్రోటోపాస్ ఎకరాకు 320 మిల్లీలీటర్లు లేదా ట్రైమిటోయట్ కలిపి పిచికారీ చేయాలి. సరైన యాజమాన్యం పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి సాధించవచ్చు.

–భూమా జ్యోతి, మండల వ్యవసాయాధికారి, సంజామల

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

కోవెలకుంట్ల: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని కోవెలకుంట్ల ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి హెచ్చరించారు. స్థానిక ముదిగేడు చౌరస్తాలో శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారు.

నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, అవుకు, జమ్మలమడుగు, తదితర ప్రాంతాల వైపు వెళ్లే వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. ఆర్సీ, లెసెన్స్, హెల్మెట్, తదితర రికార్డులు లేని వాహన చోదకులకు జరిమానా విధించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: వెంకటాపురం రోడ్డులోని పేరంటాలమ్మ గుడి వద్ద ఉన్న సబ్ స్టేషన్ పరిధిలోని మల్లెంపల్లె ఫీడర్, హైవే ఫీడర్ కింద లైన్ షిఫ్టింగ్ పనుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. పట్టణంలోని శ్రీరామనగర్, టీచర్స్‌కాలనీ, వైఎస్సార్‌నగర్, కోట్ల నగర్, నల్లగుట్టతో పాటు లక్ష్మంపల్లె, మల్లెంపల్లె గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ ఉండదని వెల్లడించారు. రైతులకు ఇచ్చే త్రీఫేస్ కరెంటు తెల్లవారుజామున 5 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు మళ్లీ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఇస్తామని తెలిపారు.

రేషన్ బియ్యం తూకాల్లో తేడా

- డీలర్ల గగ్గోలు



బియ్యం బస్తాను కలుపుకుని 41 కిలోలు ఉన్నట్లు చూపుతున్న ఎలక్ట్రానిక్ కాటా

ప్యాపిలి: సివిల్ సప్లైస్ గోడౌన్ నుంచి రేషన్ డీలర్లకు సరఫరా చేస్తున్న బియ్యం తూకాల్లో తేడాలు ఉండడంతో డీలర్లు గగ్గోలు పెడుతున్నారు. రేషన్ కార్డుదారులకు జూలై నెలలో పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై గోడౌన్ నుంచి శనివారం డీలర్లకు పంపిణీ చేశారు. ప్యాపిలి మండలం రామకృష్ణాపురం గ్రామంలోని షాపు నంబర్ 54లో బియ్యం ప్యాకెట్లను అన్‌లోడ్ చేశారు. అయితే వీటిలో ఒక ప్యాకెట్ చిన్నగా ఉండడంతో అనుమానం వచ్చిన డీలర్ పార్థసారథి బియ్యం బస్తాను తూకం వేశాడు. 50.600 కిలోలు ఉండాల్సిన బస్తా కేవలం 41 కిలోలు మాత్రమే ఉంది. దీంతో సివిల్ సప్లై అధికారుల తీరుపై డీలర్ అసహనం వ్యక్తం చేశాడు. ఈ విషయమై సివిల్ సప్లై అధికారి శ్రీనివాసరెడ్డిని వివరణ కోరగా తమ కోటాను తీసుకెళ్లడానికి డీలర్లు స్వయంగా వచ్చి కాటా వేసుకోవాలన్నారు. ఇక్కడే పరిశీలించి తూకాల్లో తేడా ఉంటే వాటి స్థానంలో మరో బస్తా ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు.

నేడు మంగపల్లెలో వైద్య శిబిరం

సంజామల: మండల పరిధిలోని మంగపల్లె గ్రామంలో పెద్దిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ పెద్దిరెడ్డి దస్తగిరిరెడ్డి తెలిపారు. ఊపిరితిత్తులు, షుగర్, బీపీ, గుండె, కంటి, చర్మ తదితర వ్యాధులకు సంబంధి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దొంగ బిల్లులతో ప్రజాధనం స్వాహా

సంజామల: మండల పరిధిలోని ఆర్.లింగందిన్నె గ్రామంలో ప్రజల తాగునీటి అవసరాలను అధికార పార్టీ నాయకులు సొమ్ము చేసుకుంటున్నారు. దొంగ బిల్లులు పెట్టి నగదు స్వాహా చేశారు. గ్రామంలో కొంత కాలం క్రితం తాగునీటి సమస్యల నెలకొనడంతో సర్పంచ్ అనుమతి లేకుండా పంచాయతీ అధికారుపై ఒత్తిడి పెట్టి నీటి మోటార్ ఏర్పాటు పేరుతో రూ.64,500 బిల్లుకు రూ.1.20 లక్షలు బిల్లు చేయించుకున్నారు. మోటర్ ఏర్పాటు చేసి ఆరు నెలలు కాకుండానే మూడుసార్లు రిపేర్ వచ్చింది. పంచాయతీ నూతన మోటర్‌ను అధికార పార్టీ నాయకులు తీసుకుని వారికి చెందిన పాత మోటర్‌ను అమర్చడం వల్లే పదే పదే సమస్యలు వస్తున్నాయని సర్పంచ్ అన్నెం దేవి ఆరోపించారు. సాధారణంగా రూ.70 వేలు బిల్లు అయితే అధికార పార్టీ నాయకులు, అధికారులు దొంగ బిల్లులు సృష్టించి రూ.50 వేలు స్వాహ చేశారని వాపోయారు. గ్రామంలో ఐదు రోజుల నుంచి నీటి సమస్యతో అల్లాడుతుంటే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు.

మత్తుతో జీవితం చిత్తు



ర్యాలీలో మాట్లాడుతున్న ఎస్‌ఐ దుగ్గిరెడ్డి

బనగానపల్లెరూరల్: యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని బనగానపల్లె ఎస్‌ఐ దుగ్గిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. పట్టణ పోలీస్‌స్టేషన్ మీదుగా పెట్రోల్‌బంకు సెంటర్ వరకు ర్యాలీ సాగింది. ఎస్‌ఐ మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తుపదార్థాలకు అలవాటు పడితే మంచి భవిష్యత్తును కోల్పోవాల్సి వస్తుందని తెలిపారు. ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. కుటుంబం రోడ్డున పడే పరిస్థితి వస్తుందని తెలిపారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి వెంకటేశ్వర్లు, పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణ, రఫీ, ఇబ్రహీం పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



నంద్యాల మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ గౌతమి

బనగానపల్లె రూరల్: బాలికలు అన్ని రంగాల్లో ప్రతిభ చాటాలని నంద్యాల మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ గౌతమి అన్నారు. శనివారం స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శక్తియాప్, ఈవ్ టీజింగ్, ఆడపిల్లలకు సామాజిక భద్రత తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో సీఐ మాట్లాడుతూ.. విద్యార్థినులు చదువుపైనే దృష్టి సారించాలని సూచించారు. చదువుకునే వయసులో టీవీ, సెల్‌ఫోన్, సోషల్ మీడియాకు దూరంగా ఉంటేనే బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ఉన్నత స్థానంలో ఉన్న మహిళలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. తల్లిదండ్రులు కూడా బాలికలను ప్రోత్సాహించాలని వారిపై వివక్ష చూపరాదన్నారు. మహిళా చట్టాలు, పోక్సో కేసు, ఈవ్ టీజింగ్ తదితర చట్టాలపై సీఐ ప్రవీణ్‌కుమార్ వివరించారు. హెచ్‌ఎం ప్రసాద్ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టమాట లారీ బోల్తా



ప్రమాదానికి గురైన వాహనం

డోన్ టౌన్: బైకును తప్పించబోయి టమాట లారీ అదుపు తప్పి బోల్తా పడిన ఘటన డోన్ మండలం ఓబులాపురం మిట్ట వద్ద శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. కర్ణాటక రాష్ట్రం కోలార్ నుంచి మహారాష్ట్రకు టమాట లోడుతో వెళుతున్న లారీ ఓబులాపురం మిట్ట వద్ద జాతీయ రహదారిపై వెళుతుండగా సడన్‌గా వచ్చిన బైకును తప్పించడానికి ప్రయత్నించడంతో బ్యాలెన్స్ తప్పి రోడ్డుపై అడ్డంగా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. అయితే లారీలోని టమాటాలు రోడ్డుపై చల్లాచెదరుగా పడడంతో నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న హైవే పెట్రోలింగ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని జాతీయ రహదారిపై ట్రాఫిక్ మళ్లించి రోడ్డును క్లియర్ చేసి క్రేన్ సహాయంతో లారీని తీశారు.



ఆర్టీసీ అవుట్ గేట్ వద్ద గుంతలమయంగా రోడ్డు

రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా

బనగానపల్లె: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి వాహనాలు బయటకు వచ్చే అవుట్ గేటు వద్ద రోడ్డు గుంతలమయంగా మారింది. వర్షానికి ఆ గుంతల్లో నీరు చేరడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్రవాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి సీసీరోడ్డు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

ఇంద్ర ధనస్సు కనువిందు

బేతంచెర్లలో శనివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఒక వైపు ఆశాశం మేఘావృతమై వర్షం కురుస్తుండగా మరోవైపు ఇంద్ర ధనస్సు కనువిందు చేసింది. వివిధ రంగులతో కూడిన ఇంద్ర ధనస్సును ప్రజలు ఆసక్తిగా తిలకించారు. –బేతంచెర్ల



కస్తూర్బాలో ఇంకెన్నాళ్లు ఇన్‌చార్జ్ పాలన

- ఎనిమిదేళ్లు అవుతున్నా రెగ్యులర్ ఎస్‌ఓ నియామకం లేదు



కస్తూర్బా పాఠశాల

కొలిమిగుండ్ల: గ్రామీణ ప్రాంత విద్యార్థినులను ఉన్నతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలను ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలలో ఆరవ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు విద్యా బోధన ఉంటుంది. 200 మందికి పైగానే గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థినులు ఉంటారు. కొలిమిగుండ్లలో మొదట ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలోని గెస్ట్‌హౌస్ భవనంలో నిర్వహించారు. తర్వాత సొంత భవనం మంజూరు కావడంతో ప్రధాన రహదారిలో నిర్మించారు. సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యాలు, దాతల సహకారంతో పాఠశాల అభివృద్ధికి దోహదపడ్డారు. దాదాపు ఎనిమిదేళ్ల నుంచి రెగ్యులర్ ఎస్‌ఓ లేకపోవడంతో పాఠశాలలోని సీనియర్ ఉపాధ్యాయులకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తున్నారు. ఇంకెన్నాళ్ల పాటు రెగ్యులర్ ఎస్‌ఓ లేకుండా పాఠశాల నిర్వహిస్తారని తల్లితండ్రుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యార్థినులకు ఎలాంటి సౌకర్యాలు అందిస్తున్నారో తల్లితండ్రులకు తెలియడం లేదు. ఆదివారం, పండుగ సమయాల్లో తమ పిల్లలను కలవాలంటే జైలులో ఖైదీల తరహాలో ప్రధాన రహదారి వద్ద ఉన్న గేటు వద్ద నిరీక్షించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లోపల మైదానంలోకి అనుమతించడం లేదన్నారు. రెగ్యులర్ ఎస్‌ఓ ఉంటే పాఠశాలలో అవకతవకలకు అవకాశం ఉండదని పలువురు తల్లితండ్రులు అభిప్రాయ పడుతున్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని ఎస్‌ఓను నియమించాలని కోరుతున్నారు.

యాగంటి ఆలయ ఈఓ బాధ్యతలు

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయ ఈఓగా పాండురంగారెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇన్‌చార్జ్ ఈఓగా వ్యవహరించిన చంద్రుడు నూతన ఈఓకు బాధ్యతలు అప్పగించారు.

కారు బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

బనగానపల్లె రూరల్: కారు బోల్తాపడి డ్రైవర్‌కు స్వల్ప గాయాలైన ఘటన మండలంలోని గులాంనబీపేట సమీపంలో శనివారం జరిగింది. వివరాలు.. నంద్యాల ఎన్జీఓ కాలనీకి చెందిన డ్రైవర్ వెంకటేష్ కారులో కైప గ్రామం మీదుగా గులాం నబీపేట వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స తీసుకుంటున్నాడు.

గొడవలకు తావివ్వొద్దు

కోవెలకుంట్ల: అల్లర్లు, గొడవలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో జీవనం గడపాలని ఫ్యాక్షన్ జోన్ సీఐ ప్రభాకర్ రెడ్డి సూచించారు. శనివారం మండలంలోని కంపమల్ల గ్రామాన్ని సీఐ సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏవైనా సమస్యలు తలెత్తితే సామరస్యంగా పరిష్కరించుకోవాలని.. లేకుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.